ఫుట్‌పాత్.. ఫుల్ జోష్

- నగరంలో ఫుట్‌పాత్ దుకాణాలు
- పండగ సందర్భంగా బిజీగా వ్యాపారాలు
- తక్కువ ధరకే దుస్తులు, ఇతర వస్తువుల విక్రయాలు
- ఆసక్తి చూపుతున్న సామాన్యులు

ప్రకాశం నగర్: సంక్రాంతిని ఘనంగా జరుపుకొనేందుకు నగర వాసులు సమాయాత్తమవుతున్నారు. పండగ అంటే గుర్తుకు వచ్చేది కొత్త దుస్తులు, నోరూరించే పిండి వంటలే. ముఖ్యంగా దుస్తులను కొనుగోలు చేసేందుకు జనం ఆసక్తి చూపుతారు. సాధారణంగా దుస్తులు కొనాలంటే పెద్ద పెద్ద షాపింగ్ మాళ్లు, షోరూమ్‌లు గుర్తుకువస్తాయి. పండగ సీజన్‌లో అక్కడ జోరుగా విక్రయాలు జరుగుతాయి. అయితే వాటితో పాటు సామాన్యుల షాపింగ్ మాల్స్‌గా ఫుట్‌పాత్ దుకాణాల్లోనూ అమ్మకాలు ఊపందుకున్నాయి. ఇక్కడ తక్కువ ధరలో దొరికే దుస్తులతో పాటు చెప్పులు, షూలు, ఇతర వస్తువులను సామాన్యులు ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు.

పెరిగిన డిమాండ్

నగరంలోని పలు ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లపై వివిధ రకాల దుస్తులు, వస్తువులను విక్రయిస్తుంటారు. డిసెంబర్ నుంచి జనవరి వరకూ పండగల సీజన్‌లో ఇవి మరిన్ని ఎక్కువ కనిపిస్తాయి. ముఖ్యంగా మెయిన్ రోడ్డు, కోటగుమ్మం సెంటర్ వంటి ప్రధాన ప్రాంతాల్లోని ఫుట్‌పాత్‌లపై దుస్తులతో పాటు చెప్పులు, షూస్, వివిధ రకాల ఫాన్సీ వస్తువులు, బొమ్మల విక్రయాలు జరుగుతున్నాయి. మహిళలకు కావాల్సిన వివిధ రకాల దుస్తులు, టాప్‌లు, చిన్న పిల్లల దుస్తులు, చెప్పులు, గాజులు, వాచీలు, బ్యాగులను ఫుట్‌పాత్‌లపై విక్రయిస్తున్నారు. వీటిని కొనుగోలు చేయడానికి పేద, మధ్యతరగతి ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. రాజమహేంద్రవరంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వచ్చి మరీ కొనుగోళ్లు జరుపుతున్నారు.



ఫుట్‌పాత్‌పై దుస్తులు కొనుగోలు చేస్తున్న మహిళలు

సందడిగా మార్కెట్

రాజమహేంద్రరంలోని ప్రధాన వాణిజ్య ప్రాంతలైన మెయిన్ రోడ్డు, కోటగుమ్మం, గుండువారి వీధి, నల్లమందు వంటి ప్రాంతాలు సంక్రాంతి పండగ నేపథ్యంలో కొనుగోలుదారులతో సందడిగా మారాయి. వీటితో పాటు వస్త్ర వ్యాపారానికి పేరుగాంచిన తాడితోట మహాత్మాగాంధీ హోల్‌సేల్ క్లాత్ మార్కెట్, చందన మార్కెట్ తదితర ప్రాంతాలు పండగ బట్టలు కొనుగోలు చేసే వారితో కిటకిటలాడుతున్నాయి.

ప్రత్యేక ఆఫర్లు

వస్త్రాలు, బంగారు ఆభరణాల కొనుగోలుపై పలు కార్పొరేట్ సంస్థలు పోటాపోటీగా ఆఫర్లు ప్రకటించాయి. లక్కీడ్రాలో ఖరీదైన కార్లు, బంగారు నక్లెసులు, గృహోపకరణాలను అందజేస్తున్నాయి. దీంతో జనాలు షాపింగ్ మాల్స్‌కు క్యూ కడుతున్నారు. వీటితో పాటు కొన్ని వ్యాపార సంస్థలు ఎలక్ట్రానిక్ వస్తువులపై కూడా పండగ ప్రత్యేక ఆఫర్లు ప్రకటించాయి. స్మార్ట్ టీవీలు, సెల్ ఫోన్లు, రకరకాల గాడ్జెట్లపై ఆఫర్లు పెట్టి యువతను ఆకర్షిస్తున్నాయి.

ట్రాఫిక్ రద్దీ

ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లలో వస్తున్న కొనుగోలుదారులతో మెయిన్ రోడ్డు చుట్టుపక్కల ఉన్న కోటగుమ్మం సెంటర్, టౌన్ హాలు రోడ్డు, నల్లమందు సందు వంటి ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోవడంతో జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సరైన పార్కింగ్ ప్రదేశాలు లేకపోవడంతో పాటు, షాపింగ్ మాల్స్‌కు వచ్చే వాహనాలను సైతం రోడ్డు పక్కనే నిలపాల్సి వస్తోంది.

అందుబాటు ధరలు



"షాపుల్లో కొనుగోలు చేసిన వస్త్రాల ధరలతో పోలిస్తే ఇక్కడ ధరలు అందుబాటులో ఉన్నాయి. వివిధ రకాల రంగులు, డిజైన్లతో పాటు నాణ్యత కూడా బాగుంది. చిన్న పిల్లల దుస్తులు బాగా ఆకట్టుకుంటున్నాయి. షూస్, హ్యాండ్ బ్యాగులు అతి తక్కువ ధరకే వస్తున్నాయి."
– ప్రసాద్, కొనుగోలుదారుడు



దుస్తుల దుకాణం



బ్యాగ్‌ను కొనుగోలు చేస్తున్న యువతి

క్లుప్తంగా

నిరాశ్రయులకు భోజనం ప్యాకెట్ల వితరణ



భోజనం ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): న్యాయవాది, వైఎస్సార్ సీపీ నాయకుడు గొందేశి శ్రీనివాసులురెడ్డి జన్మదినం సందర్భంగా వైఎస్సార్ సీపీ మహిళా నాయకురాలు షేక్ సమీరా, షేక్ సత్తార్ ఆధ్వర్యంలో శనివారం గోదావరి గట్టుపై ఉన్న వంద మంది నిరాశ్రయులకు భోజనం ప్యాకెట్లు అందజేశారు. వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు ముద్దాల అను, పార్టీ నాయకులు సద్గుణ రామారెడ్డి, పడాల శ్రీరామ్ చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. షేక్ సమీరా మాట్లాడుతూ గొందేశి పూర్ణచంద్రా రెడ్డి ట్రస్టు ద్వారా పేదలకు, నిరాశ్రయులకు శ్రీనివాసులురెడ్డి అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని నిరాశ్రయులకు భోజనం వితరణ చేసినట్టు తెలిపారు.

నేటి నుంచి థిమెటిక్ ఎగ్జిబిషన్

సీటీఆర్ఐ: ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి సంస్థ లేపాక్షి హ్యాండీ క్రాఫ్ట్ ఎంపోరియంలో ఆదివారం నుంచి థీమెటిక్ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నామని రాజమహేంద్రవరం షోరూమ్ మేనేజర్ జి.మోనిక్ తెలిపారు. ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.విశ్వ ఆదేశాల మేరకు ఈ నెల 9 వరకూ జరుగుతుందన్నారు. ఈ ఎగ్జిబిషన్‌లో నేరుగా తయారీదారులు తాము చేసిన వస్తువులను విక్రయిస్తారన్నారు. కొండపల్లి బొమ్మలు, ఏటికొప్పాక బొమ్మలు, వైట్‌వుడ్ బొమ్మలు, కలంకారి శారీస్, క్రోచేట్ లేస్ వీటితో పాటు హస్తకళల వారి చేనేత వస్త్రాలు లభిస్తాయన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో ఆదివారం నగరంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకూ ఆల్కాట్ గార్డెన్స్, ఐదు బళ్ల మార్కెట్, కన్నమ్మ తల్లి గుడి ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కడియం: గ్రామంలోని మేకలదిబ్బ ప్రాంతంలో రూ.4 లక్షలతో చేపట్టే సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణానికి శనివారం సర్పంచ్ మోసిగంటి సత్యవతి, ఉప సర్పంచ్ వెలుగుబంటి నాని కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పుట్టా అనురాధ, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

వీరభద్రరావు మృతి తీరని లోటు



వీరభద్రరావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఆకుల వీర్రాజు తదితరులు

కడియం: దామిరెడ్డిపల్లి గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ధర్మాసనం వీరభద్రరావు మృతి పార్టీకి తీరని లోటని డీసీసీబీ మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు అన్నారు. ఆయన ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శనివారం వీరభద్రరావు కుటుంబ సభ్యులను ఆకుల వీర్రాజు పరామర్శించారు. వీరభద్రరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎంపీటీసీ బుడ్డిగ వీర వెంకటరావు గౌడ్, మాజీ సొసైటీ చైర్మన్ కురుమళ్ల ఆంజనేయులు, పార్టీ నాయకులు నందపునీడి గంగారావు, బొబ్బిలి భాస్కర రావు ఆయన వెంట ఉన్నారు.

కడియం ప్రాంత అభివృద్ధికి కృషి



కడియపులంకలో శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి

కడియం: పర్యాటకంగా కడియం ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. కడియపులంకలో జాతీయ రహదారి కాలువ గట్టు నుంచి ఏటిగట్టు వరకూ రూ.1.85 కోట్లతో నిర్మించనున్న రోడ్డుకు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గుంతలు లేని రహదారులే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఎంపీడీవో కె.రమేష్, పంచాయతీరాజ్ డీఈ ఏ.రవి, ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, సర్పంచ్ పాటంశెట్టి రాంజీ, మాజీ సర్పంచ్‌లు పుల్లా రామారావు, గట్టి నరసయ్య, స్థానిక నాయకులు మార్గాని సత్యనారాయణ, గట్టి సుబ్బారావు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆంధ్రకేసరి విద్యాసంస్థలను తీర్చిదిద్దుదాం



వైఎస్ నరసింహారావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న సమితి సభ్యులు

సీటీఆర్ఐ: ఆంధ్ర కేసరి విద్యాసంస్థలను కేజీ నుంచి పీజీ వరకు తీర్చిదిద్ది, డీమ్డ్ యూనివర్సిటీగా చేసేందుకు ప్రతి సభ్యుడు కృషి చేయాలని ఆంధ్ర కేసరి యువజన సమితి తీర్మానించింది. సమితి తన అనుబంధ సంస్థల నిర్వాహకులతో నూతన అధ్యక్షుడు వి.భాస్కరరామ్ అధ్యక్షతన శనివారం ఏకేసీ రోటరీ హాల్లో సమావేశం నిర్వహించారు. ముందుగా వ్యవస్థాపకుడు వైఎస్ నరసింహారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమితి అనుబంధ సంస్థల తీరు తెన్నులు, ఆర్థిక విషయాలను చర్చించారు. సమితి ప్రధాన కార్యదర్శి సీపీ రెడ్డి మాట్లాడుతూ డీమ్డ్ యూనివర్సిటీగా తీర్చిదిద్దేందుకు ఉన్న అన్ని అవకాశాలను వినియోగిస్తామన్నారు. సమితి పూర్వాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు మాట్లాడుతూ ఆంధ్ర కేసరి విద్యాసంస్థలను తమ సొంత ఆస్తులుగా నగర ప్రజలంతా భావిస్తారన్నారు. ఆంధ్రకేసరి డిగ్రీ కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు, ప్రముఖ న్యాయవాది మద్దూరి శివ సుబ్బారావు మాట్లాడుతూ నూతన కోర్సులు తీసుకు రావడం జరుగుతుందన్నారు. అనంతరం భాస్కరరామ్‌ను జూనియర్ కళాశాల అధ్యక్షుడు జెట్టి ప్రసాదరావు సత్కరించారు. పూర్వ అధ్యక్షుడు డాక్టర్ కర్రి రామారెడ్డి, మాదిరాజు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

యువకుల మృతికి భరత్ రామ్ సంతాపం



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎంపీ భరత్ రామ్

రాజమహేంద్రవరం సిటీ: వైఎస్సార్ సీపీ పదో డివిజన్ ఇన్‌చార్జి ఆరే చిన్ని మేనల్లుళ్లు నవీన్ చంద్ర, సంతోష్ కుమార్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. ఆయన శనివారం మృతుల కుటుంబాలను పరామర్శించారు. వారిద్దరూ బుధవారం సాయంత్రం బైక్ తుని నుంచి వస్తుండగా మురారి వద్ద డివైడర్‌ను ఢీకొన్నారు. నవీన్ చంద్ర అక్కడికక్కడే మరణించగా, సంతోష్ కుమార్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశాడు. మాజీ ఎంపీ భరత్ రామ్ శనివారం ఉదయం వారి ఇళ్లకు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

గౌతమీ గ్రంథాలయాన్ని వినియోగించుకోవాలి

రాజమహేంద్రవరం సిటీ: గౌతమీ గ్రంథాలయాన్ని విద్యార్థులందరూ వినియోగించుకోవాలని కమిషనర్ కేతన్ గార్గ్ అన్నారు. రుడా నిధులతో ఆ గ్రంథాలయంలో చేపట్టిన నిర్మాణ పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వివిధ రకాల పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు ఇక్కడ ఉన్నాయన్నారు. అనంతరం కోటిలింగాలపేటలో రిజర్వాయర్ పనులను పరిశీలించారు. వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని, వేసవిలోపు రిజర్వాయర్‌ను పూర్తి చేసి ప్రజలకు నీరు అందించాలని ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశించారు. అలాగే సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన మెకానికల్ ఎస్కలేటర్‌ను సందర్శించారు. దీని సాయంతో డ్రైనేజీలో గార్బేజీను ఎప్పటికప్పుడు బయటకు తీయాలన్నారు.

నిబంధనలు మీరితే కఠిన చర్యలు

పరిశుభ్రతకు అందరూ ప్రాధాన్యం ఇవ్వాలని, నిబంధనలు మీరితే కఠిన చర్యలు తప్పవని కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. స్వచ్ఛత సర్వేక్షన్ 2025 కార్యక్రమంలో భాగంగా నగరంలో పారిశుధ్య నిర్వహణను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడం అందరి బాధ్యత అన్నారు. రైల్వే స్టేషన్ ఏరియాలో శుభ్రత పాటించని పలు షాపులకు రూ.2 వేలు చొప్పున జరిమానా విధించినట్లు తెలిపారు. ఆయన వెంట మునిసిపల్ అధికారులు ఉన్నారు.

6న స్వర్ణాంధ్ర సేవా సంస్థ వార్షికోత్సవం

రాజమహేంద్రవరం సిటీ: స్వర్ణాంధ్ర సేవా సంస్థ 27వ వార్షికోత్సవాన్ని సోమవారం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు నిర్వాహకుడు గుబ్బల రాంబాబు తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 26 ఏళ్లుగా సుమారు 18 లక్షల మంది అవసరార్థులు వివిధ రకాలుగా స్వర్ణాంధ్ర నుంచి లబ్ధి పొందడం సంతోషంగా ఉందన్నారు. వృద్ధులు, ఒంటరి జీవులు, నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించడం, అన్నార్తుల వద్దకు వెళ్లి అన్నదానం చేయడం, మహిళలకు వృత్తి నైపుణ్యంలో శిక్షణ ఇవ్వడం, రోడ్డు పక్కన ఎండలో ఇబ్బంది పడే చిరు వ్యాపారులకు గొడుగులు అందజేయడం, వికలాంగులకు, వృద్ధులకు వీల్ చైర్లు, ట్రై సైకిళ్ల పంపిణీ చేయడం తదితర సేవలు అందించామన్నారు. వేల మంది మహిళలకు టైలరింగ్, కంప్యూటర్, బ్యూటీషియన్, మగ్గం కోర్సుల్లో శిక్షణ ఇప్పించి, వారు స్వయం ఉపాధి పొందేలా చర్యలు తీసుకున్నామన్నారు. పుష్కరఘాట్, ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఐదేళ్లుగా ఉచిత మొబైల్ అన్నదానం నిరాటంకంగా నిర్వహిస్తున్నామన్నారు. సుమారు వెయ్యికి పైబడి ఉచిత వైద్య సేవ శిబిరాలు, సుమారు వందకు పైగా రక్తదాన శిబిరాలను నిర్వహించినట్టు తెలిపారు.

పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా ఉండాలి



కోటిలింగాల ఘాట్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ: గోదావరి గట్టుపై పారిశుధ్య నిర్వహణ సక్రమంగా ఉండాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని కమిషనర్ కేతన్ గార్గ్ హెచ్చరించారు. ఆయన శనివారం కోటిలింగాల ఘాట్‌ను పరిశీలించారు. అక్కడ పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో సంబంధిత శానిటేషన్ సెక్రటరీలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారికి షోకాజ్ నోటీసులు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. నిత్యం అనేక మంది ఈ గట్టుపైకి వచ్చి సేద తీరుతుంటారని, ఇక్కడి పరిస్థితి వారికి అసౌకర్యంగా ఉండకూడదన్నారు. నిబద్ధతతో పనిచేసి పారిశుధ్యాన్ని మెరుగ్గా ఉండేలా చూడాలన్నారు. అనంతరం గట్టుపై ఉన్న కమ్యూనిటీ టాయిలెట్లను పరిశీలించారు. వాటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ ఉండాలన్నారు. ఆయన వెంట మున్సిపల్ ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎ.వినూత్న తదితరులు ఉన్నారు.

'ఎన్టీఆర్‌కు నూరేళ్లు' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దర్శకుడు రాఘవేంద్రరావు, చిత్రంలో చిన్ని శ్రీను

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): అలనాటి కథా నాయకుడు, దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు సినీ, రాజకీయ ప్రస్థానంతో కూడిన అరుదైన చిత్రాలతో రూపొందించిన ఎన్టీఆర్‌కు నూరేళ్లు పుస్తకాన్ని దర్శకేంద్రుడు కె.రాఘవేంద్రరావు ఆవిష్కరించారు. హైదరాబాద్ సినీమాక్స్ కార్యాలయంలో శనివారం ఈ కార్యక్రమం జరిగింది. రాజమహేంద్రవరానికి చెందిన ఫొటోగ్రాఫర్ గరగా శ్రీనివాసరావు (చిన్ని శ్రీను) ఈ పుస్తకాన్ని రూపొందించారు. రాఘవేంద్రరావు మాట్లాడుతూ 136 పేజీల అత్యాధునిక మల్టీకలర్ ప్రింటింగ్ పుస్తకానికి రచన, రూపకల్పన చేసిన చిన్ని శ్రీనుకు అభినందనలు తెలిపారు.

కరాటేలో ఆర్ట్స్ కళాశాల విద్యార్థుల సత్తా

ప్రకాశం నగర్: కరాటే ఇండియా ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన ఫెడరేషన్ కప్ ప్రీమియర్ లీగ్ కరాటే పోటీల్లో ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. ఈ విషయాన్ని ప్రిన్సిపాల్ ఆర్.రామచంద్ర శనివారం ప్రకటనలో తెలిపారు. సీనియర్, క్యాడెట్ విభాగాల్లో తమ కళాశాలకు చెందిన పి.విజయ్, వి.వెంకట కిరణ్మయి తృతీయ స్థానాలు సాధించారన్నారు. వీరు ఫిబ్రవరిలో దుబాయ్‌లో జరగబోయే ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొంటారన్నారు.

జాతీయ రహదారిపై ట్రాఫిక్ జామ్



జాతీయ రహదారిపై రాజానగరం వద్ద ఏర్పడిన ట్రాఫిక్ జామ్



పాత జాతీయ రహదారి మీదుగా వెళుతున్న వాహనాలు

రాజానగరం: జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం గంటల తరబడి ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. వాహనచోదకులు ముందుకు వెళ్లేందుకు నానా అవస్థలు పడ్డారు. వేమగిరి సమీపంలో జాతీయ రహదారిని ఆనుకుని గేమ్ చేంజర్ సినిమా ప్రీ ఈవెంట్ నిర్వహించడమే దీనికి కారణం. ఈవెంట్ జరుగుతున్న ప్రదేశానికి దాదాపు 20 కిలోమీటర్ల దూరంలోని రాజానగరం వరకూ వాహనాలు నిలిచిపోయాయి. దీంతో పోలీసులు కొన్ని వాహనాలను గ్రామంలోని పూర్వపు జాతీయ రహదారి మీదుగా మళ్లించారు.

వివాదాస్పద స్థలం పరిశీలన



ఇరువర్గాలతో మాట్లాడుతున్న డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ జనరల్ శివరామ్

రాజానగరం: మండలంలోని చక్రద్వారబంధంలో వివాదాస్పదంగా మారిన స్థలాన్ని శనివారం అధికారులు పరిశీలించారు. ఉభయ వర్గాలతోనూ మాట్లాడి, ఆ భూమికి సంబంధించిన డాక్యుమెంట్లను పరిశీలించారు. వివరాలలోకి వెళితే.. చక్రద్వారబంధంలో కొమ్మారెడ్డి నరసింహం పేరుతో 5.58 ఎకరాల భూమి ఉంది. అదే గ్రామానికి చెందిన పేపకాయల పోతురాజు గత కొన్ని సంవత్సరాలుగా ఆ భూమిని కౌలుకు చేస్తున్నాడు. ఈ క్రమంలో ఆ భూమి అసలు యజమాని నరసింహం వారసులు అందుబాటులో లేకపోవడంతో ఆ భూమిపై రాజకీయ గెద్దల దృష్టి పడింది. ఇంకేముంది నకిలీ దస్తావేజులను సృష్టించి, ఆ భూమిని విక్రయించే ప్రయత్నాలు చేశారు. ఈ క్రమంలో వారం రోజుల క్రితం కొందరు వ్యక్తులు వచ్చి, ఆ భూమిలో ఉన్న చెట్లను మెషీన్ సాయంతో నరికిస్తుండగా గ్రామస్తులు వెళ్లి అడ్డుకున్నారు. ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొనడంతో పోలీసులు రంగ ప్రవేశం చేశారు. ఆ పనుల తాత్కాలికంగా నిలిపివేశారు. ఈ నేపథ్యంలో స్థల పరిశీలనకు వచ్చిన డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ జనరల్ బి.శివరామ్.. ఇరువర్గాలను సంప్రదించారు. దీనిపై సమగ్ర నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు.

10న సబ్ కలెక్టర్ కార్యాలయానికి తరలిరండి

ప్రకాశం నగర్: సొంత ఇల్లు లేని పేదలందరూ ఈ నెల 10వ తేదీన సబ్ కలెక్టర్ కార్యాలయానికి తరలి రావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు పిలుపు నిచ్చారు. ఆయన శనివారం గణేష్ నగర్, పోస్టల్ కాలనీ, అదమ్మ దిబ్బ తదితర ప్రాంతాల్లో ఇల్లు లేని పేదలందరితో దరఖాస్తులు పూర్తి చేయించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లను ఇంటి నిర్మాణం కోసం ఇస్తామని ఎన్నికల సమయంలో కూటమి నాయకులు హామీ ఇచ్చారన్నారు. ఈ నేపథ్యంలో దరఖాస్తు చేసుకున్న పేదలందరికీ ప్రభుత్వం ఇళ్ల స్థలాలను మంజూరు చేయాలన్నారు.

శెట్టిబలిజ సేవా సమితి క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సేవా సమితి సభ్యులు

సీటీఆర్ఐ: శెట్టిబలిజ సేవాసమితి నూతన సంవత్సర క్యాలెండర్‌ను నగరంలోని ఓ హోటల్లో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సానబోయిన రామారావు మాట్లాడుతూ శెట్టిబలిజ సంఘీయుల ఉచిత వివాహ పరిచయ వేదికను సంఘ ఆధ్వర్యంలో ఏటా ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. ఆయా విశేషాలతో ఈ క్యాలెండర్‌ని ఆవిష్కరించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు మట్టపర్తి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు కొప్పిశెట్టి నాగేంద్ర, ప్రధాన కార్యదర్శి ఏడుకొండలు, బొక్క సత్య వెంకట ప్రతాప్ పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్ వర్కర్ల ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న రామకృష్ణ తదితరులు

సీటీఆర్ఐ: ఎలక్ట్రికల్ వర్కర్ల నూతన రేట్లు అమల్లోకి వచ్చాయని గోదావరి ఎలక్ట్రికల్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు బొజ్జ రామకృష్ణ అన్నారు. ఈ మేరకు శనివారం కంబాలచెరువు నుంచి జాంపేట మీదుగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం విక్రమ హాల్లో సమావేశం జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరిగిన నూతన రేట్లను వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు. అన్ని ట్రేడ్ల వారికి ఒక ధర విధానం ఉందని, కానీ ఎలక్ట్రికల్ వర్కర్లకు మాత్రం అమలు కావడం లేదన్నారు. దీంతో నూతన ధరలు అమలు చేస్తున్నామన్నారు. అలాగే మెప్మా ఆధ్వర్యంలో ఎలక్ట్రికల్ వర్కర్లకు శిక్షణ ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు ఎడ్ల సూర్యచంద్రరావు, ఎంవీజీవీ ప్రసాద్, గౌరవ సలహాదారులు కాకిరావు బాబు, బోరా వెంకట గోపాలకృష్ణా రెడ్డి పాల్గొన్నారు.


మధ్యాహ్న భోజన పథకం ప్రారంభం



మురమండ జూనియర్ కళాశాలలో భోజనం వడ్డిస్తున్న నాయకులు

కడియం: మురమండలోని పిచ్చిగ కోటయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని టీడీపీ నాయకులు శనివారం ప్రారంభించారు. ప్రిన్సిపాల్ టీఎస్‌వీ వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వంద మంది విద్యార్థులు భోజనం చేశారు. కార్యక్రమంలో నందమూరి సూర్యప్రకాశరావు, ప్రత్తిపాటి రామారావు చౌదరి, వట్టికూటి జానికిరామ్, కడియం ఎంఈవో, జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు



శ్యామల	మ్యాక్స్
సూర్య మినీ	ముఫాసా
సూర్య ప్యాలెస్	యుఐ, క్రావెన్
శివజ్యోతి	పుష్ప–2
అనుశ్రీ	మార్కో
రాజా	పుష్ప–2
ఊర్వశి	క్రావెన్
మేనక	ఆటోరంగ, చేతిలో చెయ్యేసి చెప్పు బావ
రంభ	బచ్చల మల్లి
కుమారి	రఘువరన్ బీటెక్
అప్సర	పుష్ప–2
అశోక	మార్కో
నామవరం	
వీఎస్ మహల్	పుష్ప–2, క్రావెల్
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	పుష్ప–2
కడియం	
వెంకటసూర్య	మార్కో, పుష్ప–2